# చిల్లిగవ్వ

మాసిన గడ్డంతోను, ధూళి పట్టిన బట్టలతోను దారిద్ర్యం ఉట్టిపడుతున్న ఒక వ్యక్తిని చూసి మైథిలీపతిగారు గతుక్కుమన్నారు. అరికాలి మంట నెత్తికెక్కింది. ఆ దరిద్రుణ్ణి పలకరిస్తే తమ ప్రశస్తికి భంగం కలుగుతుందని మౌని అయి ఇల్లు చేరుకున్నారు. "ఏయ్ మైథిలీ! మీ అన్నయ్య ఎక్కడ? ఇక్కడికి గాని వచ్చాడా?" అంటూ అర్థాంగి మీద విరుచుకు పడ్డారు.

మైథిలీదేవికి భర్తగారి కోపం ప్రస్ఫుటం కాలేదు. సంవత్సరం కిందట ఒక్క నిమిషం సేపు దర్శనం ఇచ్చి, అంతర్ధానమైన తన అన్న వటపత్రశాయిని భర్తజ్ఞాపకం చెయ్యడంతో కొంత సంతోషం కలిగింది.

"అన్నయ్యేనా? ఏడాది కిందట ఓసారి ఆకస్మికంగా వచ్చి, నిమిషమే ఉండి వెళ్లిపోయాడు. అదీ చెప్పకుండానే! ఎక్కడికి పోయాడో, ఏం చేస్తున్నాడో? పోనీ, ఇక్కడ ఉన్నాను, ఈ పనిచేస్తున్నాను అని ఒక్క కార్డుముక్కైనా రాసిన పాపాన పోడు. ఇంతవరకూ వాడి ముఖం చూద్దామనున్న కోరికతో కళ్లు కాయలు కాచేటట్టు ఎంత చూస్తున్నానో నా అంతరాత్మకే ఎరుక. ఎప్పటికీ రాకపోతే నిరాశ చేసుకుని ఊరుకున్నాను. కనబడ్డాడేమిటండీ మీకు ఎక్కడైనా? మనింటికి వస్తానన్నాడా?" ఆత్రంగా భర్త జవాబుకోసం ముఖంలోకి చూసింది మైథిలీదేవి.

మైథిలీపతిగారు నిరసనగా అన్నారు: "ఎక్కడో ఏమిటి? ఈ ఊళ్ళోనే! ఉదయం బజారునుండి తిరిగివస్తూంటే మురళికేఫ్ దగ్గిర కనబడ్డాడు. రిక్షావాడిలా వేషం లానూ! ఎవరో అనుకున్నాను. తీరా పరిశీలించి చూద్దును మీ అన్నయ్య

వటపత్రశాయే! ఏం, అలా మాసినగడ్డంతోను, ధూళిపట్టిన బట్టలతోను ఇక్కడా అక్కడా బేవారసుగా తిరక్కపోతే, చక్కగా క్షవరం చేయించుకుని స్నానం చేసి మసలకూడదూ వీధిలో? నలుగురూ నవ్వుతారన్న స్పృహైనా ఉండవద్దూ? అఘనయ్యా! అతని కక్కర్లేదు; మరి నామాటా? కాస్త ఘరానా తరగతికి చెందిన మనిషి ఎవడైనా చూసి 'ఈయనేనండీ మేజిస్ట్రేట్ మైథిలీపతిగారి బావమరిది!' అని అంటే నాతల ఎగిరిపోదూ? డామిట్! మీ నాన్నతో సంబంధం చేసి, మా నాన్న నామెడకి ఉరి తగిలించి, బంగాళాఖాతంలో తోసి పారేశాడు! మైథిలీ! ఇదే నీకు చెబుతున్నా, మీ అన్నయ్యకి నువ్వుబుద్ధి చెప్పితీరాలి!"

మైథిలీదేవి మనస్సు గతుక్కుమంది. "నేనా? నేనేం చెప్పేదండీ నాకంటే పెద్దవాడైన అన్నయ్యకి! అసలు చెప్పడానికీ మానడానికీ అన్నయ్య ఓస్సారైనా ఇక్కడికి వస్తేనా? ఒకవేళ వచ్చాడనే అనుకోండి. చెబుతాను. నా బలవంతం కొద్దీ విన్నాడనే అనుకోండి. విని ఏం ప్రయోజనం? ఆచరణలో పెట్టగలిగితే కదా? పెడతాడు, దురదృష్టజీవి. అంతకన్నా అసమర్థుడూ నిర్భాగ్యుడూ ఈ ప్రపంచంలో లేడు. వాడి చేతిలో చిల్లిగవ్వ లేనట్టే మనసులో కోరికలు కూడా లేవు. వదినా బిడ్డలూ పోయాక అతను దాదాపు ఒక సన్యాసిలాగే తిరుగుతున్నాడు. అదంతా ఒకరకం పిచ్చితనం అప్పటినుండి అతన్ని ఆవరించింది. పోనిద్దురూ వాడిగొడవ మీ కెందుకు? మాసిన గుడ్డలతో తిరిగితే మీకేం, దుమ్మెక్కిన బట్టలతో తిరిగితే మీకేం? చేత చిల్లిగవ్వ లేనప్పుడే ఎంత మనిషైనా సంకుచితంగా, అతి పేలవంగా వ్యవహరిస్తాడు. అన్నయ్య నేటి బతుకూ అంతే! అయితే శుష్కించి పోయాడేమిటండీ?" అని భర్త మాటలు పక్కకు నెట్టేసి అన్నగారి ఆరోగ్య పరిస్థితి పరామర్శించింది మైథిలీదేవి.

"శుష్కించిపోక ఆరోగ్యంగా ఎలా ఉంటాడనుకున్నావు మతిలేని దానివి! మతి ననుసరించే గతి! డబ్బుకక్కుర్తికి లోబడితే పర్యవసానం ఇలానే ఉంటుంది. చేతిలో చిల్లిగవ్వ లేదని దేవురించే బదులు, నౌకరీ చేసుకోకూడదూ? పనికి రానంటుందా చేతిలో ధనం ఉంటే?" అని భుగభుగలాడారు మైథిలీపతిగారు.

"ఎందుకు పనికి రానంటుందీ? కానీ, అన్నయ్య డబ్బుకోసం ఆందోళన పడుతున్నట్టు అవుపించడు. ఎవరికోసం ఆర్జించాలి చెప్పండీ! భార్య కోసమా? బిడ్డలకోసమా? తల్లిదండ్రులూ, అన్నదమ్ములూ లేనప్పుడు ఆర్జిస్తే నేం,

లేకపోతేనేం? ఎవరిని సుఖపెట్టాలి చెప్పండీ! వీధిన పోయేవారినా?"

"వీధిన పోయేవారిని సుఖపెట్టమని నేను మాత్రం అన్నానా? నేను అనేదల్లా గౌరవంగా, దర్జాగా ఎందుకు బతకకూడదూ అని. నా బావమరిది అనిపించుకునే వ్యక్తి, తన చేతల ఫలితంగా నాకు తీరని అవమానం తెచ్చి పెడుతూంటే చూసి సహించను! తెలిసిందా?"

"సరే, అన్నయ్య కనిపిస్తే చెప్పమని సింహాద్రికి కబురు చేస్తాను. మీరు భోజనానికి లేవండి!" సర్దిచెప్పింది మైథిలీదేవి.

✿ ✿ ✿

మైథిలీదేవి తన అన్న వటపత్రశాయి దురదృష్టపు బతుకు ఓమాటు స్మృతికి తెచ్చుకుని మథనపడసాగింది. అన్నయ్య అలా అయిపోడానికి కారణం వాడిపాపం కాదు, తను చేసుకున్న పాపం! కాకపోతే తల్లిదండ్రులూ, భార్యా, బిడ్డలూ వరసగా ఒకరి తరువాత ఒకరు మరణించాలా? దానితో నిరుత్సాహి అయి ఇల్లూ, వాకిలీ, నౌకరీ సైతం విడిచిపెట్టి దేశదిమ్మరి అయిపోయాడు. అతను ఇప్పుడు నిర్లిప్తుడూ, నిష్పక్షపాతీ. స్వార్థం అన్నది ఏ కోశానా లేదు. నిర్భీతి, నిర్లజ్జా పెనవేసుకుని ఉన్నాయి. వయసు కూడా ముదరడం వల్ల ఇంక ఏపని చెయ్యడానికి ఓపిక చాలదు. ఆర్జనాశక్తి అసలే శూన్యం. అందుకే ఇక్కడికీ అక్కడికీ బంధువుల ఇళ్లకూపోయి, నామమాత్రంగా కొన్నాళ్లుండి తరలి పోతూంటాడు. ఉత్త తిండికోసం! ఎన్నాళ్లున్నా బరువుగా మాత్రం నిలిచి ఉండడు. తన శక్తి కొద్దీ చేతనైన పని మనస్ఫూర్తిగా చేసి తీరతాడు. అయితే, వాడు ఏ రాత్రికో చెప్పకుండా వెళ్లిపోవడం చూసి, దొంగకింద ప్రచారం చేస్తారు. అంతేకాని వాడి దీనావస్థ ఎట్టిదో గుర్తించరు. శక్తి ఉడిగిన ఈ వయసులో వీరింట్లో వారింట్లో, వారి వారి దూషణలన్నీ భరిస్తూ తల ఎత్తక ఊడిగం చేసుకుని జీవిస్తూంటాడు. ఆయన తన వద్దకు వచ్చి తనతోపాటే కష్టమో సుఖమో అనుభవిస్తే బావుండునని అనుకుంది మైథిలీదేవి.

"సింహాద్రీ!" పిలిచింది.

"ఏం తల్లీ?"

"అన్నయ్య అవుపడ్డాడా, సింహాద్రి, ఎక్కడైనా?"

"లేదు తల్లీ! ఊరంతా గాలించి చూశాను. అన్నయ్యగారి జాడ ఎక్కడా

లేదు. బజారులో, పార్కులో అన్నిచోట్లా వెదికాను."

"ఎప్పుడూ అన్నయ్య ఇలానే చేస్తున్నాడు, సింహాద్రీ! చెల్లెలు ఒకతె ఇక్కడ ఉందన్నమాటే మరిచిపోయాడు. నాలుగు ఏళ్లయింది. మేనల్లుడు ఒకడు పుట్టిపెరుగుతున్నాడు కదా? అథమం వాణ్ణి చూడడానికైనా ఓసారి ఈ దిక్కురాడు. ఏం, ఒక్కరోజు, కాకపోతే ఒక్కపూట ఇంటికి వచ్చి విశ్రాంతి తీసుకుని వెళ్లకూడదూ? ఎవరు వద్దన్నారు గనక."

"ఆగ్రహించుకున్నారేమిటండీ అన్నయ్యగారు? మరి ఇంతదూరం వచ్చి ఇక్కడికి రారు ఎందుచేత? ఏమిటో తల్లీ! ఇప్పటి లోకమే వేరు. ఈ బంధువులెవరూ బంధువులు కారు. అభిమానం చచ్చినవారే ఆత్మబంధువులు! ఈనాటి అత్తింటికీ, పుట్టింటికీ అట్టే తేడా లేదంటే నమ్మండి! ఆడపిల్లకి రెండూ రెండు చెరసాలలే!"

"లేదు, సింహాద్రీ! అలా అనుకోడం పొరబాటు. అన్నయ్యకి నామీద అభిమానం లేదని నేనెన్నడూ అనుకోను. పైగా నేనంటే వాడికెంతో వాత్సల్యం. నామేలు కోసం ప్రాణాలు త్యాగం చెయ్యవలసి వస్తే చేసే వ్యక్తి వాడు ఒక్కడే! అయితేనేం, కొన్నాళ్ల నుండి వాడి దినాలు బాగాలేవు. మనస్సు స్థిమితం చెడి, పిచ్చివాడై పోయాడు. ఆ పిచ్చి తగ్గేవరకూ అలా నడవవలసిందే కాలం! తగ్గే సూచనలు కూడా కనిపించవు, సింహాద్రీ! ఏం చెయ్యమంటావు?"

"ఆయనకేం పిచ్చమ్మా పిచ్చితల్లీ! పండులాంటి మనిషిలో ఉందంటారా పిచ్చితనం? చూపులో ఉందంటారా? ఎంత గౌరవంగా మాట్లాడతారు! ఎంత మనసిచ్చి మాట్లాడతారు! ఉన్న లోపమల్లా ఒక్కటే, ఆయన వేషం! ఎందుకో అందరిలా శృంగారంగా పైకి కనబడరు. నిజానికి అన్నయ్యగారంత బుద్ధిమంతుణ్ణి నేనెక్కడా చూళ్లేదు తల్లీ!"

"నీకీసారి ఎక్కడన్నా కనిపిస్తే నచ్చజెప్పి తప్పకుండా తీసుకురా, సింహాద్రీ! నీకు పుణ్యం ఉంటుంది!" ప్రాధేయపడ్డది మైథిలీదేవి.

"తప్పకుండా అలాగే తల్లీ!" అంటూ నిష్క్రమించాడు సింహాద్రి.

❁ ❁ ❁

మైథిలీపతిగారు వీధిలోనించి తిరిగివచ్చారు. ఇవాళ మరీ వేడివేడిగా.

"నిజం చెప్పు. మైథిలీ! మీ అన్నయ్యకి నువ్వుబుద్ధి చెప్పినట్టేనా?" అన్నారు.

"నిన్న సింహాద్రిచేత కబురు పంపించాను ఒక్కసారి చూసి పోవలసిందని. ఆ మాటకు బదులు చెప్పలేదట. వాణ్ణి గురించి మీరు మరేం ఆందోళన చెందకండి. నౌకరీ చూసుకుంటే చూసుకుంటాడు; లేకపోతే మానతాడు. అనుభవించేది మీరా? తనా? వంటయి గంట సేపయింది. కాళ్లు కడుక్కోండి. వడ్డిస్తాను." సమాధానపరిచింది మైథిలీదేవి.

"వడ్డన! ఏం వడ్డిస్తావు? నాకొక్క మెతుకు కూడా సయించడం లేదు, మీ అన్నయ్య అవకతవక చర్యలు చూస్తుంటే. అవమానంతో దహించుకు పోతూంది గుండె! నీకేం, మీ అన్నయ్యకేం? సిగ్గూ బిడియమూ లేకుండా సంచరిస్తారు. మధ్య తలఎత్తుకు తిరగలేక బాధపడుతున్నది నేను! ఏం చేశాడో చూశావా? చెప్పడానికి సిగ్గేస్తూంది!" స్వరం తగ్గిస్తూ అన్నారు మైథిలీపతిగారు.

"ఏం చేశాడండీ?" అన్నది అమాయకంగా మైథిలీదేవి.

"ఏం చేశాడా? బలే ఉద్యోగం చేస్తున్నాడులే కాఫీ క్లబ్బులో! ఫలాహారాల సర్వింగ్ అంతా తనదే! ఆ ఆకార వేషాలకి తోడు సరి అయిన ఉద్యోగమే దొరికింది!" గేలి చేశారు మైథిలీ పతిగారు. "నువ్వు కూడా అక్కడికే పోయి నౌకరీ కుదుర్చుకుంటే అత్యుత్తమంగా ఉంటుంది. నువ్వు పిండి రుబ్బుతావు. ఫలాహారాలు చేస్తావు. వాటిని మీ అన్నయ్య అందిస్తూంటాడు. ఇక అపఖ్యాతికి ఏ కొదవాలేదు. గాడిదలు దాపరించారు. వట్టి కంచరగాడిదలు!"

"కాఫీ క్లబ్బులోనా? ఫలాహారాలు సర్వు చేస్తున్నాడా అన్నయ్య!" చోద్యమూ, అమాయకత్వమూ ద్యోతకమయ్యాయి మైథిలీదేవి మాటల్లో. "అవునులెండి. అంతకుమించి ఏం ఉద్యోగం చెయ్యడానికి ఇచ్చేవారున్నారు గనకా! నాలుగోఫారం సరిహద్దుల్లోకైనా వెళ్లాడో లేదో? ఎక్కడికక్కడే సంతోషించాలి. అసంతృప్తి ప్రకటిస్తే మాత్రం ఏం లాభం చెప్పండీ! ఏది చెయ్యడానికీ వయసు కూడా మితిమీరిపోయిందాయె! బుద్ధి పటిమ చాలదు. పోషించుకోవాలా పొట్ట? దానికేదో ఒక నౌకరీ! కాఫీక్లబ్బులోనో, కోమటి దుకాణంలోనో ఎక్కడో ఓ చోట...."

"ఇకనేం సమర్థించడానికి చెల్లెలివి ఒకత్తెవు ఉన్నావు. పోయి, వీథులు

కూడా ఊడవమను. ఇంతకన్నా ఎక్కువే లభిస్తుంది జీతం!"

"చులాగ్గా మాట్లాడేస్తారు కాని, వీథులు తుడుస్తారటండీ ఎంత దరిద్రులైనా! మొదట మీరు చెప్పిందే బుద్ధి. ససేమిరా నౌకరీ చేస్తేకాని, వల్లకాదన్నారు. పోనీ తన మానాన తను బతుకుతున్నాడను కోరు. అవమానం, అపఖ్యాతి అని విమర్శిస్తారు. ఆఖరికి మీరు చెప్పినట్లు చేసినా అదీ ఒకనేరం కింద పరిగణిస్తున్నారు. ఎవరి మనస్తత్వం వారిది. ఒకరి పరిస్థితులు ఇంకొకరికి అర్థం కావు. ఈ సందర్భంలో నోరు మెదపకుండా ఉండడమే శ్రేయస్కరంలా ఉంది."

"ఇప్పటికి నీ లెక్చరు పూర్తి అయిందా? ఇంక ఆగు!" రీవిగా అన్నారు మైథిలీపతిగారు. "నౌకరీ అంటే చేసుకోమన్నాను గాని కాఫీక్లబ్బులోను, కోమటి దుకాణాలలోను చేసుకోమన్నానా? ఆపాటి జ్ఞానం మీ అన్నయ్యకి ఎందుకు లేదంటా? నాకు కావలసిందల్లా గౌరవం మర్యాదా!"

"పోనీండి, మిగిలిన విషయాలు ఆనక మాట్లాడుకుందాం. ముందు భోజనానికి లేవండి." ఎవరో ఒకరు వెనక్కి తగ్గితేకాని వేడి చల్లారదని సర్దుకుంది మైథిలీదేవి.

మరునాడు మైథిలీపతిగారు కోర్టుకు వెళ్లిపోయిన తరువాత సింహాద్రి వచ్చి వటపత్రశాయి, సత్రంలో జ్వరంతో స్పృహతప్పి పడిఉన్నాడనే వార్త తీసుకువచ్చాడు. నిలుచున్న పాళంగా సింహాద్రి సహాయంతో జట్కాబండిమీద బయలుదేరింది మైథిలీదేవి.

"ఇంకెంత దూరం, సింహాద్రీ, సత్రం? ఎప్పటికీ రాదేం? నా మనస్సు ఏమిటో ఆందోళనగా ఉంది. జ్వరంతో ఎంత బాధ పడిపోతున్నాడో అన్నయ్య! తీవ్రంగా ఉందేమిటి, సింహాద్రీ, జ్వరం? పిచ్చిమనిషి కాకపోతే జ్వరంతో అక్కడ బాధపడడం ఎందుకో అనాథుడైనట్టు! గుర్రాన్ని వేగంగా పరిగెత్తించమనవూ? దిగి, అన్నయ్యముఖం చూసేదాకా నాకీ ఆందోళన తగ్గదు."

"అదిగోనమ్మా అదిగో సత్రం! ఆ మలుపు తిరిగితే మర్రిచెట్టు కిందనే ఉంది. ఇంకెంతసేపు, క్షణంలో అక్కడికి చేరతాం!" అంటూ జట్కాబండివాణ్ణి తొందరపెట్టాడు సింహాద్రి.

సత్రం దగ్గిర జట్కా ఆగింది. మైథిలీదేవీ, సింహాద్రీ సత్రంలో అడుగు పెట్టారు.

"ఈ సత్రంలో అన్నయ్య ఎక్కడ, సింహాద్రీ? ఎటు పోవాలో తెలియకుండా ఉంది" అంది మైథిలీదేవి గాభరాగా.

"అటు కాదు తల్లీ! ఇటు! ఇటు! ఇలా నడిచిపోవాలి. ఆ పడుకున్న మనిషి అన్నయ్యగారేనమ్మా!" అన్నాడు సింహాద్రి.

"అన్నయ్యేనా?" అన్నది మైథిలీదేవి ఆశ్చర్యంగా. "అలా నేలపై దొర్లుతున్నాడేం, సింహాద్రీ? కప్పుకోడానికి దుప్పటీ కూడా ఉన్నట్టు లేదే?"

ధర్మ సత్రంలోని అనాథలికి మంచాలు దొరకవని మైథిలీదేవికి తెలియదు పాపం! దుప్పట్లు ఎవరిస్తారు? వీరంతా పొట్టకు తిండిలేని దరిద్రులే! ఈ ఎముకలు కొరికే చలిలో చినిగిన గుడ్డలు కట్టుకుని మాత్రమే ఇంతమంది అభాగ్యులూ బాధపడుతున్నారు. వీరిని ఎవ్వరూ చూసేవారే లేరు ఈ కైపెక్కిన ప్రపంచంలో!

"అన్నయ్యా" అని మెల్లిగా పిలిచింది మైథిలీదేవి. జవాబు లేదు.

"అన్నయ్యా!!" అని మరికాస్త గొంతుకు హెచ్చించింది మైథిలి.

అయినా ప్రత్యుత్తరం లేదు.

"ఇదేం, సింహాద్రీ, పిలిస్తే పలకడు! అబ్బ! ఎంత జ్వరం కాస్తూందో? ఒళ్లు సలసలా మరిగిపోతూంది. స్పృహ తప్పిపోయాడంటావా అన్నయ్య? ఏం జబ్బో ఏమిటో, నాకు రాకూడదూ?" కన్నీరు కార్చింది మైథిలీదేవి.

"గాభరా పడకండమ్మా! నేచూసి చెబుతాను ఉండండి. అబ్బే! ఊపిరి బాగా విడుస్తున్నారే! ఏమీలేదు తల్లీ! జ్వరం తీవ్రతకొద్దీ అన్నయ్యగారు కాస్త స్పృహ తప్పినట్లున్నారు. ఇంటికి తీసుకుపోయి, తగిన ఉపచారాలు చేస్తే ఆయనకే తెలివి వస్తుంది" అని మైథిలీదేవిని ఓదార్చాడు సింహాద్రి.

జట్కావాడి చేయూతతో మెల్లిగా ఇంటికి చేరవేశారు వటపత్రశాయిని.

❁ ❁ ❁

ఎడతెరిపి లేకుండా కాలింగ్ బెల్ మోగించారు మైథిలీపతిగారు.

"వచ్చా బాబయ్యా, వచ్చా! ఏం సెలవు?"

"మైథిలి ఏదిరా? ఏం చేస్తూంది? గంటసేపై బెల్లు వాయిస్తూంటే ఒక్కరూ పలకరేం రాస్కెల్సు! చెవులు తాళాలు వేసుకుపోయాయా?"

"పిలిచారుటండీ?" అంటూ ప్రవేశించింది మైథిలీదేవి.

"నిన్ను చంపేస్తాను, జాగ్రత్త! వాడేడీ? వాణ్ణి కూడా కాల్చి పారేస్తాను!

ఎక్కడున్నాడు మీ అన్నయ్య? నన్ను ప్రాణాలతో బతకనిస్తారా లేదా? మీ లాగే అడుక్కు తినమంటారా? దరిద్రులు పోగయ్యారు నా యింట్లో!" ఎప్పటిలాగే మండిపడ్డారు మైథిలీపతిగారు.

"చెప్పకూడదుటండీ ఏం అవాంతరం సంభవించిందో? ఏం జరిగిందీ?" అంది మైథిలీదేవి.

"ఎక్కడికి వెళ్లాడో అది ముందు చెప్పు. తరువాత ఆయన లీలలు విందువుగాని! నువ్వేనా, కాఫీ పంపించిందీ? ఎందుచేత పంపించావు? ఎవరిచేత పంపించావు?"

మధ్యలో సింహాద్రి జోక్యం చేసుకుంటూ "తప్పు నాదండీ బాబయ్యా! నన్ను మీరు కొరతవెయ్యండి. నేను తేలేకపోయాను బాబూకాఫీ. నా ఇంటి దాని పురిటి సమయం బాబూ! అర్జెంటుగా వెళ్లవలసి వచ్చింది. నన్ను చావగొట్టండి బాబయ్యా పీడ వదిలి పోతుంది!" అన్నాడు.

"ఏమిట్రా ఆ అరువు! ఏమిటా నక్క వినయాలు? గెటవుట్! ముందు నువ్వు అవతలికి పోతావా లేదా?" అంటూ భార్యవైపు తిరిగి, "మైథిలీ! మాట్లాడవేం? మిషను కుట్టు వేయించుకున్నావా నోటికి? కాఫీ ఎవరిచేత పంపించావంటా? అడుగుతున్నది నిన్నే!" అని అడిగారు మైథిలిపతిగారు.

"ఎవరి చేతనూ పంపించలేదండీ! అన్నయ్య.. తానే.. స్వయంగా... నేను ఎంత బతిమాలుతున్నా వినక ఫ్లాస్కులో పోసి ఉంచిన కాఫీ పట్టుకుని తిన్నగా ఆఫీసుకే బయలుదేరి పోయాడు. 'ఏం చెల్లీ! బావకి నే కాఫీ తీసుకు వెళితే తప్పా? ఆ మాత్రం పనికి నే తగనా?' అంటూ గబగబా వీథిమెట్లు దిగి క్షణంలో అదృశ్యుడై పోయాడు. వాడికి పుట్టిందే బుద్ధి! ఒకరు చెబితే వినేరకం అయితే కావలిసిందేమిటి? అంతా సవ్యంగానే నడచి ఉండేది" అన్నది మైథిలీదేవి.

"సవ్యంగా వచ్చే జన్మలో నడుస్తుందిలే! ఈ జన్మకు ఇదే రీతి! దేవుడు మనల్ని మనుషులుగా పుట్టిస్తాడు. మనం గాడిదలం అయిపోతామంటే అందుకు అతనిదా బాధ్యత? ఇంతకీ బుద్ధి షెడతల పట్టినప్పుడు వాతావరణ పరిజ్ఞానం నశించక ఊరుకుంటుందీ? వీథి వెంబడి ఫ్లాస్కు పట్టుకుని ఈ దొరగారునడిచి వెళుతూంటే ఎంతమంది నన్నెరిగిన పెద్ద మనుషుల్లో ఎంతమంది నవ్వుకున్నారో తనకేం కావాలి? నాదేకదూ ఆ అప్రతిష్ఠ అంతా?

"ఆఫీసులో నేను పని చేసుకుంటూంటే, ఒయ్యారంగా చిన్న చిన్న అడుగులు వేసుకుంటూ, నా దగ్గిరికి వచ్చాడయ్యా.. ఎంతో భయపడుతున్న వాడికిమల్లే! మాసినగడ్డం, జేగురు రంగు గుడ్డలూ, తైలసంస్కారం లేని తలా, చేతిలో ఫ్లాస్కూ ఇంక అడిగేదేమిటి? అన్నీ చక్కగా కుదిరాయి. మరి మేజిస్ట్రేట్‌గారి బావమరిది కదూ, చూడడమే తడువు పోల్చుకోవద్దూ?

"అప్పటికి నేనో పెద్ద పోలీసాఫీసర్‌తో మాట్లాడుతున్నాను. అదైనా చూడక్కర్లా? పోనీ తెలియని వాళ్లకి తెలియనే తెలియదు. గప్‌చిప్‌గా ఆ కాఫీ ఏదో నా మొహాన తగలేసి, కిక్కురు మనకుండా అవతలికి పోరాదూ? అబ్బే! అలా చేస్తాడూ మీ అన్నయ్య! టేబిల్‌దాకా వచ్చి 'బావా కాఫీ'! అంటూ నా ముందర పెట్టాడు. అరగంటసేపు కదలకుండా నిలుచున్నాడు. ఆ దృశ్యం చూసేసరికి నా గుండె నీరయిపోయింది. గూబ రింగుమనేటట్టు కొడదా మనుకున్నాను. గాని, ఇహ అక్కడ ఏమి అన్నా నాకే అపఖ్యాతి! లేకపోతే, మైథిలీ, ఈ పాటికి మీ అన్నయ్య పరమపద సోపానమార్గం పట్టేవాడు!"

"హరహరా! అటువంటి అపశకునపు మాటలాడకండీ! అన్నయ్య ఒకటి తలిచి కాఫీ తెస్తే, మీరు మరొక విధంగా భావించుకుంటున్నారు. సింహాద్రి, తన యింట్లో నానా గందరగోళంగా ఉందని వెళ్లిపోతూంటే విని, వేళకి కాఫీ లేక మీరేం బాధ పడతారోఅని, ఎత వద్దని బతిమాలినా వినక, స్వయంగా కాఫీ పట్టుకు వచ్చాడు. మీకు అపఖ్యాతి తెద్దామని వచ్చాడా? ఆ ఉద్దేశ్యమే వాడికి లేదండీ! కోపగించుకోక, కొద్దిగా ఆలోచించండి, మీకే అవగత మవుతుంది అన్నయ్య సౌజన్యం!" అని భర్తను బతిమిలాడింది మైథిలీదేవి.

అంతలోనే గాభరాగా పరిగెత్తుకు వచ్చాడు సింహాద్రి.

"బాబయ్యా! బావగారండీ! తమ పెద్దబావగారు! వటపత్రశాయిగారే! వీథిలో నడుచుకుంటూ వస్తూంటే ప్రమాదం! కారు కిందపడ్డారండీ! ఒళ్లంతా రక్తమయం! చేతిలో ఫ్లాస్కు చితికిపోయిందండీ! ప్రాణాలు పోతున్నాయి! పదండి పరిగెత్తండి!!" అని వణుకుతూ అంటూండగా అందరూ వీథివైపు పరుగు తీశారు.

• ఆంధ్రప్రభ వీక్లీ •
*15.12.1965*